
రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని సోమవారం ఒంగోలులో కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం


బల్క్ మిల్క్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


మల్లవరంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- మల్లవరంలో ప్రభుత్వ భవనాలు ప్రారంభం

పొదిలి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పొదిలి మండలంలోని మల్లవరంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డితో కలిసి ప్రారంభించారు. ముందుగా స్థానిక నాయకులైన మండల పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ యర్రమూడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ రెడ్డిబోయిన సుబ్బయ్య, వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ను, రూ.15.74 లక్షలతో నిర్మించిన బల్క్ మిల్క్ సెంటరు, రూ.16 లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీలను ఎమ్మెల్యే ప్రాంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకే ప్రాంగణంలో ఐదు ప్రభుత్వ నూతన భవనాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు సేవలందించడం శుభపరిణామం అన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. అర్హులందరికీ పథకాలు అందిస్తూ సంక్షేమ పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరో మారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ రాజశేఖర్, ఉప్పలపాడు, ఉన్నగురువాయపాలెం వైద్యాధికారులు సుగుణకుమార్, మంచికల మణిశేఖర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి,పట్టణకన్వీనరు నూర్జహాన్‌బేగం, జేసీఎస్ కన్వీనర్ గిలమారి చెన్నారెడ్డి, యక్కలి శేషగిరిరావు, కె.సుబ్బారావు, కల్లం సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసులు, రబ్బానీ, జాకీర్, మందలపు శ్రీనివాసులురెడ్డి, గూడూరి వినోద్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు

శేషయ్యను పరామర్శించిన బూచేపల్లి


శేషయ్యను పరామర్శిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి: అనారోగ్య కారణంతో బాధపడుతున్న మండలంలోని చందలూరు వైఎస్సార్ సీపీ నాయకుడు శింగంశెట్టి శేషయ్యను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అడ్డగిరి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలదిమ్ము రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటకు కృతజ్ఞతలు


ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని బెల్లం కొండవారిపాలెం గ్రామ సర్పంచ్ పోశం సుమలత శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గూడా సరస్వతీప్రభాకరరెడ్డి సోమవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల గ్రామంలో రోడ్డుకిరువైపులా అభివృద్ధి పనులకు ఎంపీ సహకరించినందుకు ఒంగోలులో కలిసి ధన్యవాదాలు తెలిపారు. వారి వెంట పలువురు గ్రామ నాయకులు ఉన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కంభం: స్థానిక పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్నాటి బోడయ్య మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. పంచాయతీ పరిధిలో కొత్తగా 50 పింఛన్లు మంజూరు కాగా వాటిని పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, వైస్ ఎంపీపీ రామ్మూర్తి, ఎంపీటీసీలు ఆనంద్, రఫీ, కార్యదర్శి బ్రహ్మయ్య, డాక్టర్ సద్దాం, బాషు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు

దర్శి: నేటి నుంచి రెండు రోజుల పాటు 14 నుంచి 17 సంవత్సరాల్లోపు బాలబాలికలకు మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు దర్శి మండల ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ సీహెచ్ సాంబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దర్శి గవర్నమెంట్ హైస్కూల్లో పోటీలు జరుగుతాయని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల క్రీడాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి బాలబాలికలకు క్రీడా పోటీలు

దొనకొండ: మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా 14, 15 సంవత్సరాల బాలబాలికలకు ఈ నెల 12, 13 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ కాలే నరసింహారావు తెలిపారు. పోటీల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల బాలబాలికలు పాల్గొనవచ్చని చెప్పారు. సోమవారం మండలంలోని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశమై చర్చించుకున్నారు. క్రీడా ప్రాంగణం తయారు చేశారు. కబడ్డీ, వాలీబాల్, త్రో బాల్, టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్,యోగా పోటీలునిర్వహించనున్నట్లు మండల కోఆర్డినేటర్ నరసింహారావు తెలిపారు.

భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి

ముండ్లమూరు: మండలంలో భూముల రీ సర్వే కార్యక్రమాన్ని సిబ్బంది వేగవంతం చేయాలని రీ సర్వే డీటీ స్రవంతి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే సమయంలో రైతులకు సమాచారం ఇచ్చి వారి వద్ద గల రెవెన్యూ పత్రాలను పరిశీలించాలన్నారు. కొలతల సమయంలో తేడాలొస్తే తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులతో సరిచూసుకోవాలన్నారు. సర్వే అనంతరం ఎఫ్‌టీఓ ఎల్ఆర్ ప్రకారం ఆన్‌లైన్ చేయాలన్నారు. గ్రామాల్లో అసైన్డ్ భూముల వివరాలను గుర్తించాలన్నారు. ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేద రైతుల వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వర్షంతో రైతుల్లో ఆనందం

పుల్లలచెరువు: మండలంలో ఆదివారం రాత్రి 50.06 మి.మీ వర్షం పడినట్లు రికార్డుల్లో నమోదైంది. ఈ వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పడిన వర్షాలకు రైతులు మిరప నారు నాటారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షం మొక్కలకు జీవం పోస్తుందని రైతులు అంటున్నారు. గ్రామాల్లో మిరప పంటను సాగు చేయడంతో పాటు చెరువుల కింద వరి పంటను సాగు చేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ఈ వర్షానికి చాలా గ్రామాల్లోని చెరువులకు నీరు చేరింది.

ఆర్టీసీ బస్టాండ్‌కు సిమెంటు బల్లల వితరణ

మార్కాపురం టౌన్: ఎస్‌ఈవీకే ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా ఆరు సిమెంటు బల్లలను డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులుకు అధ్యక్ష, కార్యదర్శులు గుంటక సుబ్బారెడ్డి, డాక్టర్ ఐ.బాలసుబ్బారావు అందించారు. రీడింగ్ రూమ్ కమిటీని ఆర్టీసీ డీఎం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు షేక్షావలి, జాయింట్ సెక్రటరీ ఎం.మోహన్‌రెడ్డి, కోశాధికారి పి.మల్లికార్జునరావు, సభ్యులు శాసనాల వీరబ్రహ్మం, ఆర్‌కేజీ నరసింహం, గుంటక వెంకటరెడ్డి, కంది కొండారెడ్డి, మేనేజర్ మల్లికార్జున పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


రామాంజనేయులును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

దొనకొండ: మారుమూల ప్రాంతంలోని జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న వీవీ రామాంజనేయులు రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 1998–99 పూర్వ విద్యార్థులు తమ సొంత ఖర్చులతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అవార్డు గ్రహీత రామాంజనేయులును ఎంపీపీ ఉషామురళి, ఉపాధ్యాయ సిబ్బంది, పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలు, బొకేలతో సన్మానించారు. ప్రభు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆదిమూలపు ప్రభుదాసు విద్యాశాఖ అందించిన మెమెంటోను రామాంజనేయులుకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు వాహిద్, స్టీవన్, సత్యనారాయణ, పవన్, అరుణ, కిషోర్, ఉపాధ్యాయ సిబ్బంది, పీఎంసీ వైస్ చైర్మన్ సుధీర్ పాల్గొన్నారు.

వైభవంగా కన్నయ్య కళ్యాణం


కళ్యాణంలో కొలువైన శ్రీకృష్ణస్వామి

కురిచేడు: శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రుక్మిణీ సత్యభామా సమేత శ్రీకృష్ణుని కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణపీఠం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు కళ్యాణంలో పాల్గొన్నారు. ఆలయ పూజారి నారాయణం వెంకటేశ్వర్లు భక్తులచే కళ్యాణ తంతు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు నివేదించారు. అనంతరం ఉత్సవాలకు హాజరయ్యే వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు ఏర్పాటు చేసిన గేమ్స్ ఆసక్తిగా సాగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పురావూరి కిశోర్, జవ్వాజి సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ప్రసాద్‌బాబు బాధ్యతల స్వీకరణ


ఎంపీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీఓ

కంభం: కంభం ఎంపీడీఓగా ఎస్.ప్రసాద్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ నర్సయ్య కొమరోలుకు బదిలీ అయిన నేపథ్యంలో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న మస్తాన్ వలి ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా అమరావతి మండలంలో ఈఓపీఆర్డీగా పని చేస్తూ ఎంపీడీఓగా ప్రమోషన్ పొందిన ప్రసాద్‌బాబు కంభం ఎంపీడీఓగా నియమించడంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు నూతన ఎంపీడీఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ


బాలికలకు క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ

దొనకొండ: బాలబాలికలు చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి చూపించాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్‌కు చెందిన వాహిద్, స్టీవన్, సత్యనారాయణ, పవన్, అరుణ్, కిషోర్, అరుణ సమకూర్చిన క్రీడా దుస్తులు, వాలీబాల్ కిట్లను ఎంపీపీ ఉషామురళి సోమవారం పంపిణీ చేశారు. క్రీడల్లో ఆసక్తి చూపించి పాఠశాలకు మంచిపేరు తెచ్చిపెట్టాలని ప్రభు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు ఆదిమూలపు ప్రభుదాసు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీవీ రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది, పీఎంసీ వైస్ చైర్మన్ సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

లాభసాటిగా చిరుధాన్యాల సాగు


వరి రైతులకు సూచనలిస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులకు చిరుధాన్యాల సాగు లాభసాటిగా ఉంటుందని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. వ్యవసాయశాఖ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా సోమవారం నాగంబొట్లపాలెంలో ఆయన పర్యటించారు. వరికి ప్రత్యామ్నాయ పంటలుగా చిరుధాన్యాలు సాగుచేసుకోవాలన్నారు. ప్రస్తుతం 40 శాతం మాత్రమే బోర్ల కింద వరి సాగు చేపట్టారన్నారు. సాగర్‌లో నీరు తక్కువగా ఉండటం, బోర్లలో సైతం నీరు అందుబాటులో లేకపోవడం వలన రైతులు ప్రత్యామ్నాయ పంటలైన చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయన వెంట వీఏఏ శ్రీను, రైతులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీ అధికారులు

గిద్దలూరు రూరల్: అటవీ శాఖ అమరవీరుల త్యాగాలను మరువలేనివని గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు అన్నారు. జాతీయ అటవీశాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో సోమవారం అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపదను రక్షించేందుకు వారి ప్రాణాలను సైతం కోల్పోయిన అటవీశాఖ అమరవీరుల ప్రాణత్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. అడవులను సంరక్షించడంలో అటవీశాఖ ఉద్యోగులు సంసిద్ధంగా ఉండాలన్నారు. రేంజ్ ఆఫీసర్లు కుమార్‌రాజ, జీవన్‌కుమార్, మధుప్రియ, డిప్యూటీ రేంజర్లు వంశీకృష్ణ, బాలాజీనాయక్, ఎఫ్ఎస్ఓలు రంగారెడ్డి, శ్రీనివాసులు, ఎఫ్‌బీఓలు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడులో 5 పోలింగ్ కేంద్రాలను స్థానిక తహసీల్దార్ డి.సీతారామయ్య సోమవారం పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా గ్రామంలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి అందులోని వసతుల ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట వీఆర్ఓ రమణ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

టీడీపీ బంద్ విఫలం


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్


కొత్తూరులో బలవంతంగా విద్యార్థులను బయటకు పంపుతున్న టీడీపీ నాయకులు

మార్కాపురం/పొదిలి/తర్లుపాడు: ఏపీ స్కిల్ డెవలప్ కార్పొరేషన్ నిధులు రూ.371 కోట్లు కొల్లగొట్టిన కేసులో ప్రధాన నిందితుడు ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడాన్ని నిరసిస్తూ టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపునకు పశ్చిమ ప్రకాశంలో స్పందన కరువైంది. మార్కాపురం నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు యథావిధిగా తిరిగాయి. హోటళ్లు, కూరగాయల మార్కెట్లు, సినిమా హాళ్లు, ఇతర దుకాణాలు తెరిచే ఉన్నాయి. తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లోనూ బంద్ ప్రభావం కనిపించలేదు. కీలకమైన ప్రాంతాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. పొదిలిలో సీఐ రాఘవేంద్ర, ఎస్సై వెంకట సైదులు బందోబస్తును పర్యవేక్షించారు. తర్లుపాడు మండలంలో ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో కొందరు టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. కొత్తూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలను మూతవేయాలని బెదిరిస్తుండగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిలదీయడంతో దురుసుగా ప్రవర్తించారు. అవినీతి కేసులో చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధిస్తే ఈ తరహా పోకడలేంటని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దర్శి నియోజకవర్గంలో బంద్‌కు స్పందన కరువు


బేస్తవారిపేట బస్టాండ్‌లో సీఐ రాజేష్‌కుమార్ పర్యవేక్షణ

దర్శి/కురిచేడు: చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బంద్‌కు దర్శి నియోజకవర్గంలో స్పందన కరువైంది. పోలీసులు 11 మందిని బైండోవర్ చేయగా, జనసేన, టీడీపీ కార్యకర్తలు 14 మంది రోడ్డుపై బైటాయించారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు. కేవలం 14 మంది మాత్రమే బంద్‌లో పాల్గొనడం చర్చనీయాంశమైంది. కురిచేడు మండలంలో ఎక్కడా బంద్ ప్రభావం కనిపించలేదు.

కనిపించని బంద్ ప్రభావం

బేస్తవారిపేట: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు అరెస్టు నేపథ్యంలో టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపునకు ప్రజలు, వ్యాపారుల నుంచి స్పందన లభించలేదు. దుకాణాలు, స్కూల్స్, బ్యాంక్‌లు యథావిధిగా పనిచేశాయి. ముందస్తు జాగ్రత చర్యల్లో భాగంగా 15 మంది టీడీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కంభం సీఐ రాజేష్‌కుమార్, ఎస్ఐ నరసింహారావులు బేస్తవారిపేట బస్టాండ్‌లో బంద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పర్యవేక్షించారు.

వృద్ధులకు చీరల పంపిణీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొంగలవీడురోడ్డు అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు రాచర్ల మండల అనుమలవీడు గ్రామానికి చెందిన చప్పిడి జనార్దన్ తన తల్లి జ్ఞాపకార్థం సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వాహకురాలు తిరుపతమ్మ జనార్దన్ సేవాదృక్పదాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

మంత్రి చొరవతో శాశ్వత సమస్యలు పరిష్కారం


బాగు చేసిన పొలాలకు వెళ్లే రోడ్డు


గ్రామాల్లో నూతనంగా వేసిన విద్యుత్ తీగలు

పుల్లలచెరువు: రాష్ట్రపురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చొరవ చూపడంతో ఎర్రపాలెంలో శాశ్వత సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇటీవల మండలంలోని పిడికిటివానిపల్లి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంత్రి సురేష్ నిర్వహించారు. ఆ పంచాయతీలోని ఎర్రపాలెంలో గ్రామస్తులు మంత్రితో విద్యుత్ తీగలు బాగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, అవి మార్చకపోతే ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని, గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు పొలాలకు వెళ్లె రహదారిని పక్క పొలాలు వారు ఆక్రమించారని, రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. స్పందించిన మంత్రి ఇరు శాఖల అధికారులను పిలిచి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించడంతో సోమవారం ఆ రెండు పనులు పూర్తి చేసి గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి సురేష్‌కు కృతజ్ఞతలను తెలిపారు. పనులను సర్పంచ్ మస్తాన్ రెడ్డి పర్యవేక్షించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి దంపతులకు గాయాలు


గాయపడిన జ్యోతి తలకి కట్టుకడుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

ముండ్లమూరు: ముండ్లమూరు ఆదర్శపాఠశాల వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి భార్యాభర్తలకు గాయాలయ్యాయి. గుంటూరుకు చెందిన గుంజి శ్రీనివాసరావు భార్య జ్యోతితో కలిసి సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై దర్శి బయలుదేరారు. మార్గం మధ్యలో దర్శి – అద్దంకి ప్రధాన రహదారిపై ముండ్లమూరు ఆదర్శ పాఠశాల స్పీడు బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు పీహెచ్‌సీకి తరలించగా సిబ్బంది ప్రథమ చికిత్స చేసిన అనంతరం దర్శికి తరలించారు.

మండలస్థాయి స్కూల్ గేమ్స్‌కు సర్వం సిద్ధం

కురిచేడు: మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను బుధ, గురువారాల్లో స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం జీఎస్ఆర్ సాయి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మండలస్థాయి వాలీబాల్, రన్నింగ్ రేస్, లాంగ్‌జంప్, గురువారం మిగతా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని, పోటీల కన్వీనర్ జీ విజయలక్ష్మి పర్యవేక్షిస్తారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో

ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి: మండలంలోని చందలూరు గ్రామంలో లక్ష్మీచెన్నమల్లేశ్వరస్వామి, పార్వతీదేవి అమ్మవారి సమేత శివుని ఆలయ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.